# వారు ముగ్గురు

తెల్లవారి లేచేసరికి పాడుపడ్డ కొంప ముందర అలికి ముగ్గులున్నాయి. ఇదిచూసి ఆ గ్రామ ప్రజలు ఆశ్చర్యాందోళనలతో ఒకరి ముఖాలొకరు వింతగా చూసుకొన్నారు. నాకు తెలియదంటే నాకు తెలియదన్నట్లు అందరికళ్లూ ఒక్కమారు కలుసుకొన్నాయి. నిజానికిది అంత ఆశ్చర్యం, ఆందోళన పడవలసినంత గొప్ప సంగతి కాదు. పట్టణాలలో అయితే పొరుగువారి ఇల్లు తగులపడుతున్నా ఇంకా తమ దాకా రాలేదుకదా అని వూరుకొంటారు. ఒకరి మంచి చెడ్డలలో, కష్టసుఖాలలో మరొకరికి ప్రమేయం ఉండదు. ఇతరుల పనిపాట్లలో జోక్యం కలిగించుకొనే తీరిక కూడా వారికుండదు. కాని పల్లె ప్రజలు మాత్రం ఊరిలో వున్న వారందరి బాధ్యతా తమ భుజస్కంధాల మీద ఉన్నట్లే భావిస్తారు. పూర్వపు రోజులలో ఈ భావనే ఎంతో సహాయకారిగా వుండి పల్లెలో ఐకమత్యం, సంఘజీవనం ఎంతో సంతృప్తికరంగా వుండేవి. కాని నేడు ఈ భావనే పల్లెలకు చీడపురుగులా అంటుకుని శాంతి అనే పదానికి తావులేకుండా గ్రామ జీవనాన్ని కల్మషం చేస్తున్నది.

ప్రతి గ్రామంలోను వార్తాహరుల వంటి వారు కొందరైనా వుండకమానరు. వీరికి ఎవరి ఇంట్లో ఏమి జరిగినా, ఎవరి మనస్సులో ఏమివున్నా, ఎలాగైనా కూపీ తీసి, అసలు వృత్తాంతానికి మరి నాలుగు కల్పించి జన బాహుళ్యానికి అందచేయందే నిద్రరాదు.

దెయ్యాలకొంప ముందర ముగ్గురు చూడగానే కామమ్మ సోమమ్మ బయలుదేరారు విషయాన్వేషణకి.

"ఏమండోయి ఎవరున్నారు ఇంట్లో, దేవతలా, మనుష్యులా?" అని దండకంలా చదువుతున్నాది కామమ్మ. ఆమె మాటలు ఇంకా పూర్తికాక మునుపే, లోపలున్న వారు తలుపు తెరచుకొని బయటకొచ్చారు. వచ్చినవారు ముగ్గురూ స్త్రీలే. అందులో మధ్యనున్న ఆమె మిగతా ఇద్దరికన్నా కొంచెం పెద్దదానిలా కన్పిస్తున్నది. రమారమి ముప్ఫైయేళ్లుండవచ్చు అనుకున్నది సోమమ్మ. మిగతా యిద్దరికి ఇరవై, పాతిక ఆ మధ్యనుంటాయి. అనుకొంది కామమ్మ. ఆ ముగ్గురు స్త్రీలు జండా అంచుగల ఖద్దరు చీరలు కట్టుకున్నారు. వంటిని అట్టే అలంకారాలు లేకపోయినా వున్న రెండేసి గాజులు, మెళ్లో గొలుసు తళతళ మెరుస్తున్నాయి. వారు ముగ్గురు అంత అందకత్తెలని చెప్పలేకపోయినా అనాకారులు మాత్రం కాదు. లక్ష్మీకళ ముగ్గురి ముఖాలలోను తాండవిస్తున్నది. వారు ముగ్గురు ఐక్యకంఠంతో "రండి మామ్మగారు" అని పలకరించారు.

"మీరు ఈ యింట్లోకి రాత్రే వచ్చారు లాగుందే?" అన్నది కామమ్మ ఒక్క అడుగైనా ముందుకి వేయకుండానే.

"అవునండి. నిన్న రాత్రే వచ్చాము" అన్నది ఆ ముగ్గురిలో పెద్దది. అంతేకాని ఎందుకొచ్చారో, ఏ వూరునుంచి వచ్చారో, ఎవరెవరు వచ్చారో ఏమీ వివరంగా చెప్పనందుకు మండిపడ్డాది సోమమ్మ తనలో. కాని వారి వేషాలనుబట్టి, అంటీ అంటనట్టున్న సమాధానాలబట్టీ పట్నం నుంచే వచ్చారని, అందులోను రాత్రి రైలులో ముగ్గురూ ఆడవాళ్లే వచ్చారు కాబట్టి, చదువుకొని ఇల్లూ వాకిలీ పట్టకుండా తిరిగే రకమనీ గ్రహించుకొన్నది సోమమ్మ.

ఇల్లు నాల్గుమూలలా కలయచూసింది. అన్నీ పరిశుభ్రంగా, నీటుగా ఎక్కడివక్కడ అమర్చివున్నాయి. ఒక్కరాత్రిలో ఆ దెయ్యాలకొంపని అంత బాగా చేశారంటే.. ఒకవేళ వీళ్లు కూడ దెయ్యాలు కారుగదా? అనుకొంది. ఆమాట తోచగానే ఆమె కాళ్లు గడగడలాడి మరి నిలబడలేకపోయింది. "రావే కామమ్మా! మరి మనకు పనీ, పాటూ లేదా" అంటూ ఇవతలబడింది.

ఇవతలబడి సరాసరి నీలాటి రేవుకే బయలుదేరింది. సగము దూరము వచ్చేదాకా తను బిందె తేలేదన్న సంగతే ఆమెకు స్పృహ రాలేదు. ఇంటికి వెళ్లి బిందె తెస్తూ మరోమారు చూసింది ఆ పాడుకొంప వైపు. ఆ ముగ్గురు యువతులూ పెరటిలోని గడ్డీ, గాదరా పీకి పారవేసి పెరడు శుభ్రపరుస్తున్నారు. చదువుకొన్న వాళ్లకి ఈ ఓపిక ఉంటుందా, అని ఆశ్చర్యపోయింది సోమమ్మ. నిజంగా వీళ్లు దయ్యాలేమో? అని మళ్లా జ్ఞాపకానికొచ్చి ఒకటే పరుగుతీసింది నీలాటిరేవుకు.

"ఒసే పేరమ్మా? కన్నమ్మా, నిన్నేనే గున్నమ్మా! మన వూరికి కామినీ భూతాలు ఒచ్చేయఁరా..:. కామినీ భూతాలు. నిన్న రాత్రే దెయ్యాల కొంపలో దిగాయి. ఇక మనమందరం పోతే పోవాలి కాని అవి మాత్రం ఆ కొంపను వదిలేలాలేవు. అప్పుడే ఆ కొంపను బాగుచేసుకొన్నాయి. పెరట్లో మొక్కలు కూడా నాటుతున్నాయి" అన్నది సోమమ్మ.

"ఎలాగ మరి కామమ్మొదినా మన భూతాల పేరయ్య కూడా ఊళ్లో లేడు. వారం పదిరోజులకి గాని రానని చెప్పి నిన్ననే వూరికి వెళ్లాడు. ఈలోగా ఈ దెయ్యాలు మనలందరినీ తినేస్తాయేమో?" అన్నది భయంగా కన్నమ్మ.

గున్నమ్మ గొంతు బాగా తగ్గించి "మన మాటకేమే, ముందర మగవాళ్లను కాచుకోవాలి. అవి కామినీ భూతాలు" అన్నది.

"అయ్యో! అలాగా, నాకేం దారమ్మా, తల్లీ నూకాలమ్మా నా పసుపు కుంకాన్ని నిలపేవంటే నీ జాతర నీకు పసుపు కుంకుమ పంపుకొంటాను, నీదే భారం తల్లీ! అని గ్రామదేవతకి దండం పెట్టి యింటికి బయలుదేరింది కన్నమ్మ. దెయ్యాల భయంతో గుండెలు పీచుపీచుమంటున్నా, ఇళ్లలో పనులు తప్పవని మెల్లగా బయలుదేరారు ఆ గ్రామ స్త్రీలు నీలాటిరేవునుండి.

◆ ◆ ◆

అప్పుడే దెయ్యాలు ఊరిలో దిగి మూడు రోజులయింది. కాని ఇప్పటిదాకా అవి ఎవరికి ఏ హానీ చెయ్యలేదు. అసలు ఆ గడపదాటి ఇవతల కాలుపెట్టనేలేదు. అవి ఆ యింట్లో ఏమి చేస్తున్నాయో చూద్దామని వుద్దేశమున్నా, గుమ్మాలకీ, కిటికీలకీ వున్న తెరలమూలాన గ్రామస్థులకు వీలుకాలేదు. ఇంట్లోకి వెళ్లడానికి అందరికీ హడలే. ఈ భయం ఆడవాళ్ల నుండి మొగవాళ్ల దాకా ప్రాకింది. ఆ ఊరిలోకెల్లా బహు నిబ్బరమైనవాడు, చదువుకొన్నవాడు అయిన గ్రామ మునసబు రంగారావు ఊళ్లో లేడు. నాలుగో నాటికి అతను ఊరి నుంచి వచ్చేసరికి, దెయ్యాలు వంకర కాళ్లు, సొట్ట చేతులు ఊపుకొంటూ ఎలా వచ్చినదీ, అందరూ చూస్తుండగానే ఆ పాడు ఇల్లు ఎలాగ నీటుగా మారిపోయింది, కళ్లకు కట్టినట్లు వర్ణిస్తూ చెప్పారు సోమమ్మ, కామమ్మ అతనితో.

వీళ్ల మాటలు లెక్కచేయకపోయినా వీరితో విరోధము పెట్టుకోవడానికి ఎవరికీ ఇష్టం ఉండదు. అలా ఎవరైనా చేస్తే వారి సంసారాన్ని భూస్థాపితం చేసి మరీ నిద్రపోతారు. అందుచేత రంగారావు "సరిలెండమ్మా! వాటి సంగతి నే కనుక్కుంటా. మీరు భయపడకండి" అన్నాడు వూరడింపుగా.

ఇంతలోనే అతని భార్య కన్నమ్మ వచ్చి అమాంతంగా అతని కాళ్లు పట్టుకొని "మీ రా యింటికి వెళ్లకండి, నన్నూ పిల్లల్నీ అర్ధాన్నం చేస్తారా? ఇంకెప్పుడూ మీ మాట కాదనను. అమ్మణ్ణి మీయిష్టమొచ్చిన వాడికే యిచ్చి, పెళ్లిచేదురుగాని, నేనింకెప్పుడూ పుట్టింటికి పోతానని బెదిరించను, నాకు కాసులు, కంటే అసలేవద్దు. నా మాట వినండి. నా పసుపు కుంకుమ నిలపండి" అని ఒకటే ఏడ్పు మొదలుపెట్టింది. ఇదంతా చూస్తున్న రంగారావుకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. "సరే, నేను వెళ్లను, వారిని రావన్న చేత గెంటిస్తాను సరేనా" అని నెమ్మదిగా ఆమెను వూరడించి, రావన్నను వున్న సంగతి కనుక్కురమ్మని పంపాడు.

వెళ్లిన రావన్న వెంటనే వచ్చి "ఆరికి మీ కాడ పనుందట. ఆరే వత్తామన్నారు" అన్నాడు. దానితో ఊరిలోని జనం అంతా రంగారావు ఇంటి ముందర పోగయ్యారు. కర్రలూ, కత్తులూ పట్టుకొని కొందరూ, విభూతి, రుద్రాక్షమాలలు పట్టుకొని కొందరు. ఆంజనేయ దండకం చదువుతూ కొందరు, కాని అందరూ వార వారల నక్కే వున్నారు. రంగారావు మాత్రం నిర్వికారంగా ఈజీచైరులో కూర్చుని పేపరు చదువుకొంటున్నాడు.

ఆ ముగ్గురు యువతులూ అన్న వేళకి సరిగా రానేవచ్చారు. కొందరు చదువుతున్న ఆంజనేయ దండకం కాని, త్రోవలో చల్లిన విభూతికాని, వారి రాకను ఆపలేకపోయాయి. రంగారావు వారికి ఎదురుగా వెళ్లి స్వాగతమిచ్చాడు. వారు ముగ్గురూ అరగంటసేపు రంగారావుతో ఏమేమో ఇంగ్లీషులో మాట్లాడి ఎలా వచ్చినవారు అలానే వెళ్లిపోయారు. వారు దెయ్యాలు కారనీ, మన గ్రామాలపాలిట దేవతలవంటివారనీ, సాంఘిక సేవనే పరమావధిగా పెట్టుకొని మన పల్లెలను బాగుచేయడానికి వచ్చారనీ, అందుకు గ్రామ మునసబు యొక్క అనుజ్ఞలేందే వీలులేదు కాబట్టి, ఈ మూడురోజులు వూరుకొన్నారనీ,

రంగారావు ఎంత చెప్పినా గ్రామస్థుల అనుమానం పోలేదు. సోమమ్మ, కామమ్మ నిశ్చయించుకొన్నదేమిటంటే, రంగారావు ఆ దెయ్యాలకి లొంగిపోయాడని,

ఆ యిల్లే కాక మరి రెండు యిళ్లు కూడా ఆ దెయ్యాలు వశము చేసుకున్నాయి. అయిదారుగురు నౌకర్లు కూడా పట్నం నుంచి వచ్చారు. వారితో కొంత సామాను, ఒక వంటమనిషి, ఒక పనిమనిషి కూడా వచ్చారు. వారు తెచ్చిన సామాన్లలో చాలమట్టుకు ఆ గ్రామప్రజలు ఏనాడూ చూడనివే. ఆ మూడుయిళ్లకి, ద్వారాలకి రంగులు, గుమ్మాలకు పసుపు, కుంకుమ రాశారు. పట్నం నుంచి తెచ్చిన పూలకుండ్లను ఇళ్ల ముందు అందంగా అమర్చారు. గ్రామస్థుల భయసందేహాలెలావున్నా ఈ యిళ్ల దగ్గరికి రాకుండా వుండలేకపోతున్నారు. ఒకనాటి ఉదయాన్న మూడు యిళ్ల ముందర మూడు రంగుల జండాలు పాతారు. రంగారావులాటి యువకులు ఎవరో ఒకరిద్దరు వెళ్లారు. మూడు ఇళ్లకీ ముచ్చటగా తెలుగులో వ్రాసిన బోర్డులు కరట్టారు. రవణయ్య పంతులు బళ్లో గుణింతాలు నేర్చుకుంటున్న పిల్లలు ఆ పేర్లను "రామాపుర గ్రామ మహిళా మందిరము", "రామాపుర గ్రామ వైద్యాలయము", "రామాపుర గ్రామ ఉచిత విద్యాలయము" అని కూడబలుక్కొని చదువుకొన్నారు. ఆ ముగ్గురు యువతులూ అక్కడికి చేరిన పిల్లలందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. "మీరు ఈ స్కూలుకి వచ్చి బుద్ధిగా చదువుకొంటే, మీకు రోజూ ఇలానే మిఠాయి పెడ్తాము" అన్నారు. పిల్లల ఆనందానికి మేరలేదు. "రమణయ్య పంతులు పిలకా హూత్, మే మా బళ్లో చదవం హోత్" అని గోలచేసుకొంటూ ఇళ్లకి వెళ్లిపోయారు. కానీ, ఏ తలీల్లండ్రులూ తమ పిల్లల్ని ఆ స్కూలుకి పంపడానికి ఇష్టపడలేదు. రంగారావు ఇద్దరు కొడుకులు మాత్రమే వెళ్లుతున్నారు. వారము రోజులలో పట్నం నుండి ఓ పదిమంది పిల్లలు వచ్చారు. వారి శుభ్రత, తెలివితేటలు చూసిన మీదట గ్రామ ప్రజలలో సంచలనము ప్రారంభమైంది. 'రమణయ్య పంతులు బళ్లో ఎన్నాళ్లు చదివినా అంతే! చూడు... నిండా పదిరోజులు కాక మునుపే రంగారావు కొడుకులు ఇంగ్లీషు పేర్లు చదువుతున్నాడు. చకచకా లెక్కలు ఎలా చేస్తున్నారో" అని గుసగుసలు బయలుదేరాయి. ఇంతకీ కామినీ భూతాలు పెద్దవారిని బాధిస్తాయి కాని పిల్లల్ని ఏమీ చెయ్యవని భూతాల పేరయ్య తీర్మానించాడు. మరునాటినుండి గ్రామంలోని పిల్లలంతా బిలబిలా బయలుదేరారు క్రొత్త స్కూలుకి. కొందరు, రహస్యంగా వైద్యాలయానికి వెళ్లి మందులు కూడ తెచ్చుకుంటున్నారు. గ్రామంలో క్రమక్రమంగా మార్పు వస్తున్నది. ఇదివరలో వారి ముగ్గురి గురించి వున్న భయం గ్రామస్థుల మనస్సులలోంచి దూరమౌతున్నది. కాని సోమమ్మ, కామమ్మ మాత్రం వారి నమ్మకాలను వదలలేదు. వారు ముగ్గురు తప్పక భూతాలేనని, లేకుంటే ఇంతమందిని ఇలా తమవేపుకు లాక్కోలేరని, ఇంక ఈ గ్రామానికి నాశనం దాపురించిందనీ, అడిగినవారితోను అడగనివారితోను చెప్తున్నారు. అంతేకాక రాత్రివేళల కొరివి దయ్యాలు ఊళ్లో తిరుగుతున్నాయని, వారు ముగ్గురు ఆ దెయ్యాలతో ఏదో గుసగుసలాడుతున్నారనీ, ఆ కొరివి దెయ్యాలు చూరుల క్రిందినుంచి తిరుగుతున్నాయి.

కాబట్టి ఇక అగ్నిభయం గ్రామానికి తప్పదని, మరో భీతిని ప్రజలలో రేకెత్తించారు. గ్రామస్థులందరూ రాత్రయేసరికి గుప్పిట ప్రాణాలు పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నారు.

కొన్ని రోజులు గడిచాయి. ఆ మూడు సంస్థలు, ఆ ముగ్గురి నాయకత్వం క్రింద అభివృద్ధి చెందుతున్నాయి. అవి యిప్పుడిప్పుడే ప్రజల ఆదరాభిమానముల నందుకోగల్గుతున్నాయి. ఒకనాటి నిశిరాత్రిలో ఊరు మధ్యలో ఇళ్లు అంటుకున్నాయి. ఇళ్లను అంటించి పారిపోతూన్న ఒక వ్యక్తిని పట్టుకున్నారు. ఆ వ్యక్తి దయ్యమో, మనిషో చూచే తీరిక గ్రామస్థులకేది? వెంటనే ఒక గదిలో వుంచి తాళము వేసి మంటలు నార్పడానికి బయలుదేరారు. గ్రామస్థులంతా కలిసి బహుకష్టంతో ఆ మంటలను ఆర్పేసరికి తెల్లవారింది. ఆ ఆపద సమయంలో వారు ముగ్గురు చేసిన సేవకి, చిన్న, పెద్ద అందరి హృదయాలలోను వారిపట్ల కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది. గ్రామస్థులంతా ఐక్యకంఠంతో “రంగారావు చెప్పింది అక్షరాలా నిజం. మీరు ముగ్గురూ మా గ్రామం పాలిట దేవతలు తల్లీ” అన్నారు. తమ కృషి ఈనాటికైనా ఫలించి గ్రామస్థులలో మార్పు వచ్చినందుకు సంతోషించారు వారు ముగ్గురు.

గ్రామమంతా చల్లబడి మంటలు ఆరిపోయిన తరువాత ఈ అనర్థానికి కారణమైన ఆ వ్యక్తిని, కాదు కాదు కొరివి దయ్యాన్ని గదిలో నుండి బయటికి లాగారు. ఆ వ్యక్తి చూసి గ్రామస్థులంతా ఆశ్చర్యపోయారు. దెయ్యాల భయం పోయినందువల్ల పొట్టకూడు పడిపోయిన భూతాల పేరయ్య.